క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు స్పీచ్ థెరపీ


పిల్లలకు అవగాహన కల్పిస్తున్న థెరపిస్ట్ బాలేశ్వరి

కూర్మన్నపాలెం: పదాల ఉచ్చరణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లలకు శుక్రవారం మెలకువలపై అవగాహన కల్పించారు. వడ్లపూడి భవిత కేంద్రంలో స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలకు విషయం అర్థం అయ్యేలా మెలకువలు వివరించారు. దీని వల్ల పిల్లలు ఉచ్చరణలో అభివృద్ధి సాధిస్తారని ఆమె వెల్లడించారు. గాజువాక మండలం నుంచి 50మంది పెదగంట్యాడ మండలం నుంచి 25 మంది పిల్లలు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి వారంలో రెండు రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు విశ్వనాథం, సునీత తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యంతో సీఐఎస్ఎఫ్ ఉమ్మడి శిక్షణ

ఉక్కునగరం: భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు, కార్యాచరణ సంసిద్ధతను బలోపేతం చేసుకునే దిశగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా భారత సైన్యంతో సీఐఎస్ఎఫ్ ఉమ్మడి శిక్షణా విన్యాసాలను ప్రారంభించనుంది. మొదటిసారిగా సీఐఎస్ఎఫ్ కశ్మీర్ లోయలోని ఉన్నత భారత సైనిక నిర్మాణాల్లో పూర్తి స్థాయి బ్యాచ్‌లకు శిక్షణను నిర్వహించనుంది. ఈ శిక్షణలో నైట్ ఆపరేషన్స్, జంగిల్ వార్‌ఫేర్, క్లోజ్-కాంబాట్ టాక్టిక్స్, ఎండ్యూరెన్స్ బిల్డింగ్ డ్రిల్స్ వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ఈ హై-ఇంటెన్సిటీ శిక్షణ కోసం 35 ఏళ్లలోపు ఉన్న సీఐఎస్ఎఫ్‌కు చెందిన క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్‌టీ)సభ్యులు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సిబ్బందిని ఎంపిక చేస్తున్నట్లు స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ డి.జితేంద్రబాబు తెలిపారు. ఈ సంయుక్త శిక్షణ సీఐఎస్ఎఫ్ దళాల నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఆందోళనలో శుక్రవారం సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ కర్మాగారంలో ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నప్పటికీ కార్మికులను ప్రోత్సహించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే యాజమాన్యం మొండి వైఖరి వీడి పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.భానుమూర్తి, వెంకటరావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం


చదును చేసిన స్థలం

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని వేమన ఐటీఐ ఎదురుగా గల రజకుల కాలనీ ఏరియాలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడానికి కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం ఏకంగా పొక్లెయిన్ పెట్టి చదును చేశారు. స్థానికులతో పాటు 64వ వార్డు టీడీపీ అధ్యక్షుడు హరికృష్ణ ఈ వ్యవహారంపై పెదగంట్యాడ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సుమారు 60 మంది ప్రభుత్వ స్థలంలో పొక్లెయిన్‌తో చదును చేస్తుండగా తాను ప్రశ్నించానన్నారు. దీంతో వారంతా తనపై దౌర్జన్యం చేశారని వివరించారు. దీనిపై తహసీల్దార్ అమలను వివరణ కోరగా అది ప్రభుత్వ స్థలమేనన్నారు. ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిప్యూటీ మేయర్ అండతోనే..
ఈ స్థలాన్ని డిప్యూటీ మేయర్ అండతో కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. విలువైన స్థలాన్ని కొట్టేసేందుకు పొక్లెయిన్‌తో చదును చేయడానికి దిగారన్నారు. దీన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

ఈవీ క్రేజ్!



గాజువాకలో పెరుగుతున్న విద్యుత్ వాహనాలు

గాజువాక ప్రాంతంలో ఎలక్ట్రికల్ వాహనాల (ఈవీ) హవా కనిపిస్తోంది. పెట్రోలు, డీజిల్‌తో నడిచే వాహనాలకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రికల్ వాహనాలు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపిస్తున్నారు. పర్యావరణపై అవగాహన పెరగడంతో పాటు నిర్వహణ వ్యయం తక్కువగా ఉండడంతో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలు కలిపి గాజువాకలో దాదాపు 45వేలకు పైగా ఉంటాయని అంచనా వేస్తున్నారు.

– గాజువాక




అమ్మకానికి సిద్ధంగా ఎలక్ట్రికల్ స్కూటర్లు

నిపుణుల సూచనలు ఇవీ

- సామర్థ్యం, బ్యాటరీల కండీషన్ పరిశీలించి ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసేముందు బ్యాటరీల ప్రమాణాలను చూసుకోవాలి.
- కొందరు తక్కువ ధరకే వాహనాలు అందిస్తామంటూ నాణ్యత లేని బ్యాటరీలు అమర్చి విక్రయించే పరిస్థితులున్నాయి. వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలి.
- ఎలక్ట్రికల్ వాహనాలను ఇంట్లో ఉన్న విద్యుత్ ప్లగ్ పాయింట్లకు చార్జింగ్ పెట్టకూడదు. ఎలక్ట్రికల్ చార్జింగ్ పాయింట్లను సాధ్యమైనంత వరకు ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. నిర్దేశించిన సమయం వరకే చార్జింగ్ ఉంచాలి. సమయం పూర్తయిన వెంటనే చార్జింగ్ పాయింట్ నుంచి వైర్లు తొలగించాలి.
- బ్యాటరీలపై నీరు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు పడితే బ్యాటరీ ఉబ్బిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.
- ఏఆర్ఏఐ సర్టిఫికెట్లను పరిశీలించి బ్యాటరీలు కొనుగోలు చేసుకోవాలి.

- కాలుష్య రహిత ప్రయాణానికి మొగ్గు
- నిర్వహణ వ్యయం తక్కువ
- 45 వేలకు పైగా ఈవీ వాహనాలు



మూడేళ్లలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగం గణనీయంగా పెరిగింది. టూ వీలర్, త్రీ వీలర్‌తోపాటు కార్ల కొనుగోళ్లు కూడా జోరందుకున్నాయి. ఆటోవాలాలు కూడా ఈ వాహనాలవైపే మళ్లుతున్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోల్చితే ఖర్చు తక్కువగా ఉండడం, రాయితీలు, ప్రోత్సాహకాలు లభిస్తుండడంతో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. గాజువాక ప్రాంతంలో అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలు 45 వేలకు పైగా ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఐదేళ్లలో భారీగా పెరిగిన హవానాలు
2020–21లో ఎలక్ట్రిక్ వాహనాలు వెయ్యిలోపే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కాగా 2024–25 నాటికి వీటి సంఖ్య 35 వేలకు పెరిగింది. ప్రస్తుతం ఎలక్ట్రికల్ బైకులు రోజుకు సగటున 20 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్‌కు వస్తున్నట్టు ఆర్టీవో అధికారులు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో విద్యుత్ కార్ల సంఖ్య కూడా పెరిగింది. గడిచిన ఏడాదిలో సుమారు 250 ఎలక్ట్రికల్ కార్లకు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు చెబుతున్నారు. కాగా ఎలక్ట్రికల్ ఆటోల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ప్యాసింజర్లతోపాటు సరుకు రవాణాకు కూడా ఈ ఆటోలను వినియోగిస్తున్నారు.

ఆకర్షణీయ మోడళ్లు, సౌకర్యాలు..
మొదట్లో విద్యుత్ వాహనాలు వాహనదారులను అంతగా ఆకట్టుకోలేకపోయాయి. ఇప్పుడు డిజైన్ విషయంలో కంపెనీలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. చార్జింగ్ సామర్థ్యం, వేగం, మన్నిక పెరగడంతో ఎలక్ట్రికల్ వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడా వాహనాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. జీపీఎస్, డాష్‌బోర్డులతోపాటు వాటిల్లో ఉండే ఫీచర్స్ వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. పిల్లలను స్కూళ్లకు దింపడానికి, ఇంట్లోకి అవసరమైన సరకులు తెచ్చుకోవడానికి, ఇంటి నుంచి పాతిక, ముప్పై కిలోమీటర్ల దూరం వెళ్లి రావడానికి ఈ వాహనాలు ఉపయోగిస్తున్నారు.

సమస్య వస్తే పరుగులే..
ఇన్ని రకాల సౌకర్యాలు ఉన్న ఎలక్ట్రికల్ వాహనాలు ఒక్క సారి ఆగితే మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఏదైనా మరమ్మతు వస్తే ఈవీలను కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే చూపించాల్సి వస్తోంది. టెక్నీషియన్లను ప్రోత్సహిస్తే ఎలక్ట్రికల్ వాహనదారులకు ప్రయోజనకరంగా, సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రధానంగా చార్జింగ్ సమస్య వాహనదారులను వేధిస్తోంది. నగరంలో ఎక్కడా చార్జింగ్ స్టేషన్లు, సర్వీసింగ్ సెంటర్లు లేకపోవడంతో ఈవీ వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. చార్జింగ్ స్టేషన్లు, సర్వీసు సెంటర్లు లేకపోవడంతో ప్రతి చిన్న సమస్యకు షోరూంలకు పరుగులు తీయాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. బ్యాటరీలు పాడైనా, బ్రేకులు ఫెయిలైనా రిపేరు చేయించుకోవడానికి తగినన్ని సర్వీసు సెంటర్లు కూడా లేవని చెబుతున్నారు. చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తే పర్యావరణ హితంతో కూడిన ప్రయాణాలు చేయవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక భారం తగ్గింది



నేను గాజువాక నుంచి అనకాపల్లి ప్రతిరోజు వెళ్లి వస్తుంటాను. దీనికోసం పెట్రోల్‌కు నెలకు రూ.2,500 ఖర్చు చేసేవాడిని. ఎలక్ట్రికల్ స్కూటర్ కొనుగోలు చేసిన తర్వాత ప్రయాణం కోసం నాకు ఖర్చులేకుండా పోయింది. ఎలక్ట్రికల్ స్కూటర్ చార్జింగ్‌కు నెలకు కేవలం రూ.400 అవుతోంది. ఈ లెక్కన నాకు నెలకు రూ.2000 మిగులుతోంది.

– జి.ఈశ్వర్, బ్యాంకు ఉద్యోగి

చార్జింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



నేను ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాను. సాధారణ బైక్‌పై నేను రాకపోకలు సాగించేటప్పుడు ప్రతినెలా పెట్రోల్‌కు సుమారు రూ.4వేలు అయ్యేది. ఎలక్ట్రికల్ వాహనం తీసుకున్నాక నాకు ఆ ఖర్చు తగ్గింది. అయితే, బ్యాటరీ బైక్‌లకు చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేవు. చార్జింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది.

– సీహెచ్.శ్రీనివాస్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్

ఘనంగా శతవసంతాల జన్మదిన వేడుక


100వ పుట్టిన రోజు వేడుకల్లో కుటుంబ సభ్యులతో పుష్పవతి

ఉక్కునగరం: వందేళ్ల మైలురాయిని చేరుకున్న గూడూరు పుష్పవతి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా వణుకూరు గ్రామానికి చెందిన హోల్‌సేల్ పండ్ల వ్యాపారి గూడూరు రామ్మోహన్‌రావు సతీమణి పుష్పవతి.. ఎన్నో కష్టాలను ఎదుర్కొని నాలుగు తరాలకు ఆదర్శంగా నిలిచారు. భర్తను, కుమారుడిని, కుమార్తెను కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో కుటుంబాన్ని ముందుకు నడిపారు. ఆమె మనుమడు, స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పదవీ విరమణ చేసిన కడియాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె మనుమలు, ముని మనమలు, కుటుంబ సభ్యులు హాజరై.. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. వందేళ్లు నిండినా ఆమె ఇప్పటికీ తన పనులను తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండడం విశేషం.

115 మందికి కంటి వైద్య పరీక్షలు


పినమడక పాఠశాలలో నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో సాయి శైలజ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విజన్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎంఈవో గొంతిన సాయి శైలజ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకోపోవడం వల్ల కంటి సంబంధ వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 15 మందికి కళ్లద్దాలు అందించేందుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మానందం, విజన్ కేర్ ఆస్పత్రి నిర్వాహకులు కె.శివకుమార్, కె.సుధారాణి, ప్రజా సంఘాల ప్రతినిధులు కె.జోగినాయుడు, బలిరెడ్డి సత్యనారాయణ, కె.హనుమంతురావు, ఉపాధ్యాయులు కొండబాబు, నాయుడుబాబు, రమేష్ సూర్య, సత్యవతి, శ్యామల, శ్రీదేవి పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయండి

- ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి
- జోనల్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం


గాజువాక జోన్‌లో పన్నుల వసూలును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్


తుంగ్లాం ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

గాజువాక: జోనల్ స్థాయి అధికారులు తమ విధుల పట్ల అంకితభావం కలిగి ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. గాజువాక జోనల్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలను పరిశీలించి ఆయా విభాగాల్లో కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని శ్లాబ్ సీలింగ్‌లు పాడవడాన్ని గుర్తించిన ఆయన వాటి మరమ్మతులు, పెయింటింగ్‌లకు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం జోనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వసూళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పన్నుల వసూలు సరిగ్గా జరగడం లేదని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు, పందుల నియంత్రణ, బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేసే విధానం, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, అక్రమ కట్టడాలు, అనుమతి లేని భవనాలు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సంబంధిత అధికారులకు వివిధ సూచనలు చేశారు. జోన్‌లో సామాజిక భవనాలు, వాటి నిర్వహణ, స్వయం సహాయక సంఘాల గ్రూపులు, ఆ సభ్యుల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, ట్రిపుల్ ఆర్ సెంటర్ నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, పులి లక్ష్మీబాయి, రాజాన రామారావు కమిషనర్‌ను కలిసి తమ వార్డుల్లో సమస్యలను వివరించారు. పరిశీలించి చర్యలు చేపడతామని కమిషనర్ పేర్కొన్నారు.

ఆట స్థలం పరిశీలన
కాగా, జోనల్ కార్యాలయం తనిఖీకి ముందు కమిషనర్ 69వ వార్డులోని తుంగ్లాం ప్రాంతంలోని ఆట స్థలాన్ని పరిశీలించారు. క్రీడల కోసం గ్రౌండ్‌కు రోజూ ఎంత మంది వస్తారని అడిగి తెలుసుకున్నారు. ఈ మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ శేషాద్రి, అధికారులు దామోదర్, సీహెచ్.రామనారాయణ, గోవిందరావు, వెంకటరావు, అప్పారావు, గంగాధర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వల్లే వీవీవీ టీచర్ మృతి

- రూ. కోటి నష్టపరిహారం చెల్లించాలి
- కార్పొరేటర్ గంగారావు డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దుర్మార్గ చర్యల వల్ల ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) టీచర్ మల్లాది రవి మోహన్‌మృతి చెందారని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు ఆరోపించారు. మల్లాది రవి 28 ఏళ్లుగా వీవీవీలో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్నారన్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. 6 నెలలుగా ప్లాంట్ యాజమాన్యం టీచర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక కేజీహెచ్‌లో చేరి మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్ మృతికి ప్లాంట్ యాజమాన్యంతో పాటు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వ చర్యలే కారణమన్నారు. తక్షణమే పాఠశాల టీచర్ల వేతనాలు బకాయిలు విడుదల చేయాలన్నారు. మృతి చెందిన టీచర్‌కు రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా హైకోర్టు ఈ మరణాన్ని సుమోటాగా స్వీకరించి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టి విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్వార్టర్ల కేటాయింపు నిర్ణయంపై హైకోర్టుకు ‘సీ’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అధికారులకు బలవంతంగా క్వార్టర్లు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఉక్కు అధికారుల సంఘం (సీ)ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం క్వార్టర్లు తీసుకోని వారికి హెచ్ఆర్ఏ ఇవ్వబోమని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మధ్యంతర ఉత్తర్వుల కోసం సీ ప్రతినిధులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 24న కేసు విచారణకు వచ్చింది. అనంతరం కేసును ఈనెల 29కి వాయిదా వేసినట్టు సీ ప్రతినిధులు తెలిపారు.

పట్టుబడిన వాహనాల భద్రతకు చర్యలు

3.40 ఎకరాల స్థలం కేటాయింపు


పట్టుబడిన వాహనాలతో నిండిపోయిన గాజువాక పోలీస్ స్టేషన్ ప్రాంగణం

గాజువాక: వివిధ కేసుల్లో పోలీసులు పట్టుకున్న వాహనాలను భద్రపరచడానికి గాజువాక రెవెన్యూ అధికారులు 3.40 ఎకరాలు కేటాయించారు. మండల పరిధిలోని జగ్గరాజుపేట సర్వే నంబర్ 85లో స్థలాన్ని గుర్తించారు. ఇకపై జోన్-2 పరిధిలోని గాజువాక, స్టీల్‌ప్లాంట్, దువ్వాడ, పెందుర్తి, గోపాలపట్నం ప్రాంతాల పోలీసులు పట్టుకొనే వాహనాలను ఆ స్థలంలో భద్రపరిచే విధంగా పోలీస్ అధికారులు చర్యలు ప్రారంభించారు.

ఇప్పటికే జోన్-2 పోలీస్ స్టేషన్లలో ఉన్న వాహనాలను కూడా ఆ స్థలంలోకే తరలించనున్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ట్రాఫిక్, క్రైం, శాంతి భద్రతల విభాగాలకు సంబంధించి ఏ కేసులో వాహనం దొరికినా ఇకపై ఆ స్థలంలోనే భద్రపరుస్తారు. దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలో గడిచిన 20 ఏళ్ల నుంచి వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీస్ స్టేషన్ల ఆవరణల్లోనే భద్రపరుస్తూ వస్తున్నారు. దీంతో పోలీస్ స్టేషన్ల ప్రాంగణాలు వాహనాల డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. కొన్నిసార్లు కోర్టు అనుమతితో వేలం వేసి కొన్ని వాహనాలను పోలీసులు విక్రయించడంతోపాటు మరికొన్ని వాహనాలను ఆయా వాహనాల యజమానులకు అప్పగించారు. అయినప్పటికీ వాహనాల సంఖ్య తగ్గకపోవడంతో స్టేషన్ల ప్రాంగణాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత పోలీసులు అధికారులు సీపీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వాహనాలను భద్రపరచడానికి స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. దీన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు జగ్గరాజుపేటవద్ద స్థలం కేటాయించడంతో సమస్యకు పరిష్కారం లభించినట్టయింది. కాగా, సంబంధిత స్థలాన్ని తాము స్వాధీనం చేసుకున్న తర్వాత వాహనాల తరలింపును ప్రారంభిస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ


బర్మా కాలనీలో పూజలు చేస్తున్న అర్చకుడు


వెండి చీరలో కన్యకాపరమేశ్వరి


పూజలో పాల్గొన్న భక్తులు


ఉక్కు త్రిశక్తి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన

పెదగంట్యాడ: శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో ఆలయాలు శ్రావణ శోభ సంతరించుకున్నాయి. హౌసింగ్‌బోర్డులోని కన్యాక పంచాయతన దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బర్మాకాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కనకదుర్గమ్మకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

- పెదగంట్యాడ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి నాగమళ్ల ప్రభోజి, లలిత దంపతుల ఆధ్వర్యంలో కన్యాకపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. పలు పిండి వంటలు అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కులుకూరి మంగరాజు, కొత్తా సూర్యనారాయణ, తీగెల శ్రీనివాసరావు, మోటమర్రి అప్పలరాజు, శంకా కోటేశ్వరరావు, సత్యవరపు నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు
ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలు ఘనంగా జరిగాయి. శ్రావణ మాస మొదటి శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మికి వేకువజామున గోత్ర నామార్చన నిర్వహించారు. మహాదుర్గా దేవికి పంచామృతాభిషేకం అనంతరం అమ్మవార్లకు రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో శ్రీమహాలక్ష్మికి సామూహిక కుంకుమార్చన, సహస్ర గులాబీ పుష్పార్చన చేశారు. అనంతరం అమ్మవారికి దీప, నక్షత్ర హారతులు అందజేశారు. ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.


పూజలందుకున్న మహాలక్ష్మి దేవి